# అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు నమ్మకండి
- సంక్షేమానికి మారుపేరు సీఎం కేసీఆర్ పాలన
- ప్రజల ఆశీర్వాదంతో మరోసారి గెలుస్తా
- బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పాలకుర్తిలో నామినేషన్ దాఖలు



పాలకుర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల/పాలకుర్తి రూరల్, నవంబర్ 6 : సీఎం కేసీఆర్ ఆశీస్సులు, ప్రజల సహకారంతో పాలకుర్తి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతల మాయమాటలు నమ్మొద్దని, తన హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఘన విజయం చేకూర్చాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం స్థానిక రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, పార్టీ మ్యానిఫెస్టోను అమలు చేశానని పేర్కొన్నారు. తాను నియోజకవర్గంలో అడుగుపెట్టిన నాడు అన్ని మండలాల్లో కరువు తాండవించేదని, సాగు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపేవారన్నారు. వ్యవసాయం లేక రైతులు వలస వెళ్లడంతో ఇళ్లకు తాళాలు కనిపించేవన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పెద్ద ఎత్తున సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడడంతోపాటు 'మిషన్‌కాకతీయ'లో చెరువులను పునరుద్ధరించడంతో జలకళ సంతరించుకుని బీడు భూములు సస్యశ్యామలమయ్యాయని ఎర్రబెల్లి తెలిపారు. సీఎం కేసీఆర్ 'మిషన్‌భగీరథ' చేపట్టడంతో ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందుతున్నదన్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన సీఎం కేసీఆర్ రైతుబంధు పథకంలో పంటలకు పెట్టుబడి సాయం ఇస్తున్నారని వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.లక్ష చొప్పున పంట రుణాలు మాఫీ చేశామన్నారు. రూ.22 వేల కోట్లు రుణం ఉండగా, ఇప్పటి వరకు రూ.19 వేల కోట్లు బ్యాంకుల్లో జమ చేశామని, మిగిలిన నిధులు త్వరలోనే జమ చేస్తామన్నారు.

**పాలకుర్తి ప్రజల రుణం తీర్చుకోలేనిది..**

తనను పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు మూడు సార్లు గెలిపించారని, సీఎం కేసీఆర్ తనకు కీలక మంత్రి పదవి అప్పగించారని ఎర్రబెల్లి తెలిపారు. పంచాయతీరాజ్ శాఖను సమర్థ వంతంగా నిర్వహిస్తుండడంతో తెలంగాణకు దేశంలోనే ఏ రాష్ట్రానికి దక్కనన్ని అవార్డులు వచ్చాయన్నారు. మరోసారి ప్రజలు ఆశీర్వదిస్తే అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేయిస్తానని వివరించారు. ప్రతి గ్రామంలో వంద మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. పాలకుర్తికి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెస్తానని చెప్పి అమలు చేశానని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు, తొర్రూరులో 100 పడకల దవాఖాన, పాలకుర్తిలో 50 పడకల దవాఖానలు మంజూరు చేయడంతో పాటు శంకుస్థాపన చేశామని ఎర్రబెల్లి వివరించారు. కొడకండ్లలో టెక్స్‌టైల్ పార్కును రూ. 100 కోట్లతో చేపట్టదుకు శంకుస్థాపన చేశామన్నారు. దీనికి 100 ఎకరాల స్థలం కేటాయించామని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 5,500 డబుల్‌బెడ్ రూం ఇండ్లు నియోజకవర్గానికి మంజూరు చేయగా 90 శాతం పూర్తి చేశామన్నారు. వాగులపై రూ. 100 కోట్లతో చెక్‌డ్యాములు నిర్మించడంతో సాగునీటి సమస్య తీరిందన్నారు. రూ. 1000 కోట్లతో బీటీ, సీసీ రోడ్లు నిర్మించామన్నారు.

**పాలకుర్తి కేంద్రంగా టూరిజం కారిడార్**

సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో పాలకుర్తి కేంద్రంగా రూ. 100 కోట్లు వెచ్చించి టూరిజం కారిడార్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. పాలకుర్తి శైవ క్షేత్రాన్ని సుందరంగా తీర్చి తొలికవి సోమనాథుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించామన్నారు. మహాభాగవతాన్ని రచించిన బమ్మెర పోతనామాత్యుడి స్వగ్రామం బొమ్మెరలో పోతన విగ్రహంతో పాటు బాసరకు దీటుగా తీర్చిదిద్దుతున్నట్టు పేర్కొన్నారు. రామాయణాన్ని రాసిన వాల్మీకి నడయాడిన వల్మిడి గుట్టపై భద్రాచలం, అయోధ్యకు దీటుగా నూతన రామాలయ నిర్మించినట్లు గుర్తు చేశారు.

**ప్రజల ఆకాంక్ష మేరకు అభివృద్ధి పనులు**

నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలకుర్తి మ్యానిఫెస్టోను అమలు చేసేందుకు కార్యాచరణ చేపడుతున్నట్టు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. రైతులు పండించిన పంటలకు నష్టాన్ని కలిగిస్తున్న కోతుల సమస్యను నివారించేందుకు వాటిని అడవులకు తరలించే నిరంతర కార్యక్రమాన్ని తీసుకొచ్చామన్నారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పించే కార్యక్రమం అమలు చేస్తున్నారు. మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి ఉచితంగా కుట్టుమిషన్లు అందించడంతోపాటు టెక్స్‌టైల్ పరిశ్రమల్లో ఈ సంవత్సరం ఏడు వేల మందికి ఉద్యోగాలు ఇప్పించామన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు లేని 20 వేల మందిని గుర్తించి వారికి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించామని ఎర్రబెల్లి తెలిపారు. కరోనా కాలంలో ప్రజలకు అండగా నిలిచి బాధితులకు వైద్య సాయం అందించడంతోపాటు పేదలు, కూలీలకు నిత్యావసర వస్తువులు అందించామన్నారు.

**10న మరోసారి నామినేషన్ దాఖలు చేస్తా..**

ఈ నెల 10న మరోసారి నామినేషన్ దాఖలు చేస్తానని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. పార్టీ శ్రేణులతో కలిసి వేలాది మందితో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేస్తానని, దీనికి ముఖ్యఅతిథులుగా మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్, స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఆరోగ్య శ్రీ ట్రస్టు చైర్మన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు హాజరవుతారని ఆయన వెల్లడించారు. ఈ నెల 14న తొర్రూరులో నిర్వహించే ఎన్నికల ప్రచార సభకు సీఎం కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. అనంతరం దయన్న పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు రామసహాయం కృష్ణకిషోర్‌రెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీనాయక్, పాలకుర్తి ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, తొర్రూరు జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ పెద్దవంగర, దేవరుప్పుల, పాలకుర్తి మండలాల అధ్యక్షులు ఈదూరు ఐలయ్య, తీగల దయాకర్, పసునూరి నవీన్, నాయకులు ఈదునూరి రమాదేవి, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, పాలకుర్తి, దేవరుప్పుల జడ్పీటీసీలు పుస్కూరి శ్రీనివాస్‌రావు, పల్లా భార్గవీసుందర్‌రామిరెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఎర్రబెల్లి రాఘవరావు, రాంబాబు, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మదార్, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య పాల్గొన్నారు.

**యాదాద్రి, పాలకుర్తి క్షీరగిరి క్షేత్రంలో పూజలు**

నామినేషన్ దాఖలు ముందు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో, హనుమాన్ ఆలయంలో, ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయం, రామన్నగూడెం షిరిడీ సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు. తొర్రూరులోని మసీదులో ప్రార్థనలు చేశారు.



మరిపెడలో మాట్లాడుతున్న ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, చిత్రంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్

## వందకు పైగా స్థానాలు బీఆర్ఎస్ పార్టీవే..

- రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఖేల్ ఖతం
- డిపాజిట్లు దక్కించుకునేందుకే ఆ పార్టీ నాయకుల ఆరాటం
- ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత

మరిపెడ, నవంబర్ 6 : సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ వందకు పైగా అసెంబ్లీ స్థానాలను సునాయాసంగా గెలుస్తుందని ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎంపీ మాలోత్ కవిత అన్నారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలో సోమవారం ఆమె రైతుబంధు సభ్యుడు కొమ్ము చంద్రశేఖర్ రూపొందించిన జానపద పాటల సీడీని ఆవిష్కరించారు. అనంతరం డోర్నకల్ నియోజకవర్గ పార్టీ శ్రేణులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి కాలం చెల్లిందన్నారు. సంక్రాంతి ముందు వచ్చే గంగిరెద్దుల్లా ఆయా పార్టీల నాయకులు పల్లెల్లో తిరుగుతున్నారని, వారిని ప్రజలు పట్టించుకోవద్దన్నారు. ప్రజల కష్టసుఖాల్లో ఏనాడు పాలు పంచుకోని నాయకులు ఎన్నికల సమయంలో పర్యాటకుల్లా వచ్చిపోతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. 14 ఏళ్ల పోరాటం ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత దుస్థితి, స్వరాష్ట్రంలో జరిగిన ప్రగతిని ప్రతి ఒక్కరూ పరిశీలించాలన్నారు. గతంలో మహిళలు తాగు నీళ్ల కోసం బిందెలతో కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దయనీయమైన స్థితి ఉండేదని, నేడు సీఎం కేసీఆర్ పాలనలో పల్లెల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీళ్లు అందుతున్నాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.3వేలు, రూ.400కే వంట గ్యాస్ సిలిండర్, ఇంటింటికీ సన్నబియ్యం తదితర సంక్షేమ అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు డిపాజిట్లు దక్కించుకునేందుకు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి భారీ మెజార్టీ అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, ఎంపీపీ గుగులోత్ అరుణా రాంబాబు, జడ్పీటీసీ తేజావత్ శారదారవీంద్రనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూరాకుమారి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకన్న, దిగజర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కష్టాలే..

- బీఆర్ఎస్‌తో రాష్ట్రం అభివృద్ధి
- గిరిజనులను కించపరిచిన రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పాలి
- సంక్షేమ పథకాలపై తండాల్లో చర్చ జరగాలి
- అధికారంలోకి వస్తే మహిళల కోసం అన్నపూర్ణ, సౌభాగ్యలక్ష్మి పథకాలు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జై కొడుతున్న ప్రజలు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 6 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ కష్టాలను కొనితెచ్చుకున్నట్లేనని, జనాలకు మంచి చేసిన బీఆర్ఎస్‌ను ఆదరిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని బలరాంతండా, అమనగల్, గుండాలగడ్డతండా, సింగారం, అయోధ్య, ముడుపుగల్ గ్రామ పంచాయతీల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. తండావాసులు ఎమ్మెల్యేకు బోనాలు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. కుంకుమ తిలకం దిద్ది ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలనగానే అనేక పార్టీల నాయకులకు తండాలకు వచ్చి మాయమాటలు చెబుతారని, అవేమీ ప్రజలు పట్టించుకోవద్దన్నారు. మోసం చేసిందెవరు.. అభివృద్ధి చేసిందెవరో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. గతంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ తండాలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అన్ని విధాలా అభివృద్ధి చేశారని అన్నారు. సీఎం కేసీఆర్ ఎంతో కష్టపడి 24 గంటల కరెంట్‌ను తీసుకొస్తే కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల కరెంటు చాలంటూ చులకనగా మాట్లాడుతున్నాడని అన్నారు. పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలను కొని తెచ్చుకోవడమేనన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గిరిజనులను కించపరిచాడని, సారా పోస్తే ఓటేస్తారని అహంకారంతో మాట్లాడిన అతడికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. మహిళలను అభివృద్ధి చేయాలని ప్రధాన లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ అన్నపూర్ణ, సౌభాగ్యలక్ష్మి వంటి పథకాలను మ్యానిఫెస్టోలో పెట్టడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రియాంక, కేసన్‌రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ మహబూబ్ పాషా, నాయిని రంజిత్, తేళ్ల శ్రీను, అశోక్‌నాయక్, ఆవుల వెంకన్న, ఇస్లావత్ కవితారాంజీనాయక్, భూక్యా సురేందర్, నలమాస శ్రీను, నర్సింగ్ వెంకన్న, షరీఫ్, రామచంద్రు, బాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

గుండాలగడ్డ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్‌తోపాటు మరో 15 మంది నాయకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లోకి వస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమైందని, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు.